జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 103 26-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## కేసీఆర్ ఇప్పుడు మనిషి కాదు..

- ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆయన రారు: కవిత నిప్పులు
- టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన) పార్టీని ప్రకటించిన కవిత
- తెలంగాణ ఆత్మను బీఆర్ఎస్ కోల్పోయిందని ఎద్దేవా
- కేసీఆర్ ఒక మర మనిషి అంటూ ఘాటు వ్యాఖ్యలు
- తెలంగాణ ఆత్మను కాపాడేందుకే కొత్త పార్టీ అని వెల్లడి

తెలంగాణ రాజకీయ యవనికపై ఒక భారీ విస్ఫోటనం సంభవించింది. బీఆర్ఎస్ పార్టీకి కొంత కాలం క్రితం రాజీనామా చేసిన కల్వకుంట్ల కవిత, తెలంగాణ రాజకీయాల్లో తన ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. తన తండ్రి కేసీఆర్ పైనే తిరుగుబాటు జెండా ఎగురవేసి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా జనసముద్రం సాక్షిగా ఆమె తన కొత్త పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన' (౨=ా) పేరును ప్రకటించి, రాజకీయ వర్గాలను ఆశ్చర్యంలో ముంచెత్తారు.

2లో



## మే 9న తెలంగాణకు ప్రధాని మోడీ..

2లో

- పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాట్లు
- అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు
- బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం పెంచే పర్యటన

## 'హెచ్1బీ' కష్టాలు


### మూడేళ్ల నిషేధం విధించాలంటూ అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు

న్యూఢిల్లీ: అమెరికాలో స్థిరపడాలనే భారతీయ టెక్నాలజీ నిపుణుల ఆశలపై నీళ్లు చల్లేలా అగ్రరాజ్యం కీలక అడుగులు వేస్తోంది. వీసా వ్యవస్థ ప్రక్షాళన పేరుతో నూతన హెచ్1బీ వీసాల జారీపై




## నాకు మరో అవకాశం దక్కడం నా అదృష్టం

- ముంబైలో 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డు అందుకున్న సీఎం చంద్రబాబు
- సైబరాబాద్ తర్వాత అమరావతి రూపంలో మరో నగరాన్ని నిర్మించే అవకాశం దక్కిందని వెల్లడి
- హైదరాబాద్‌ను మించిన నగరంగా, ఫ్యూచర్ సిటీగా అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టీకరణ
- మోదీ ఒక రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్ అని ప్రశంస
- గ్రీన్ ఎనర్జీ, ఏఐ, జనాభా నిర్వహణ వంటి భవిష్యత్ ప్రణాళికలను వివరించిన చంద్రబాబు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైబరాబాద్‌ను నిర్మించి దేశానికి ఒక టెక్నాలజీ రాజధానిని అందించిన తనకు, రాష్ట్ర విభజన అనంతరం అమరావతి రూపంలో మరో నగరాన్ని నిర్మించే అద్భుతమైన అవకాశం దక్కిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నానని, అమరావతిని కేవలం ఒక రాజధానిగా కాకుండా, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే 'ఫ్యూచర్ సిటీ'గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ముంబైలో ప్రతిష్ఠాత్మక 'ఎకనమిక్ టైమ్స్' సంస్థ నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో చంద్రబాబు పాల్గొన్నారు.

2లో

## సోమనాథ్ ఛటర్జీలా ఉంటారా? కర్ణుడిలా మిగిలిపోతారా?..

- మోషేన్ రాజుకు అశోక్ బాబు సూటి ప్రశ్న
- చైర్మన్ రాజకీయ దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారన్న అశోక్ బాబు
- జరిమానా ఎదుర్కొన్న తొలి చైర్మన్‌గా మోషేన్ రాజు నిలిచారని విమర్శ
- చైర్మన్ పదవి ధర్మాన్ని సోమనాథ్ ఛటర్జీలా కాపాడాలి కానీ, కర్ణుడిలా మిగిలిపోవద్దని హితవు
- వైసీపీకి విధేయత చూపాలనుకుంటే పదవికి రాజీనామా చేయాలని సూచన
- రాజీనామాకు కారణాలు సహేతుకంగా లేవంటూ తిరస్కరించడం చట్ట విరుద్ధమని వెల్లడి



## తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు..

- 13 మందికి స్థానచలనం హైదరాబాద్ కలెక్టర్‌గా ఉన్న హరిచందన బదిలీ
- ఢిల్లీ తెలంగాణ భవన్ స్పెషల్ ఆఫీసర్‌గా సంజయ్ కుమార్
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు మారిన దాన కిషోర్
- ఖమ్మం, నిర్మల్, సంగారెడ్డి కలెక్టర్లకు స్థానచలనం

2లో

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు భారీ స్థాయిలో 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దాసరి హరిచందన సహా పలువురు సీనియర్ అధికారులు, జిల్లా కలెక్టర్లకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గవర్నర్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ కుమార్ (1995 బ్యాచ్)ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కార్మిక, ఉపాధి కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎం. దాన కిషోర్ (1996 బ్యాచ్)ను సంజయ్ కుమార్ స్థానంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రత్యేక ప్రధాన



## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్..

- మంత్రి పదవిపై కోదండరాం ఏమన్నారంటే..!
- కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదం
- తనకు మంత్రి పదవిపై ఆశ లేదన్న కోదండరాం
- ప్రజా ప్రయోజనాలే తనకు ముఖ్యమని వ్యాఖ్య

2లో

# మళ్లీ మొదటికి!

- వెనుతిరిగిన ఇరాన్... ముందుకు రాని అమెరికా
- డిమాండ్ల చిట్టాను పాక్‌కు ఇచ్చేసి ఒమన్‌కు పయనమైన ఇరాన్ మంత్రి
- పరోక్ష చర్చలకు ఆసక్తి చూపని ట్రంప్
- పాక్‌కు తన బృందాన్ని పంపబోమని వెల్లడి
- రెండో దఫా ప్రత్యక్ష చర్చలపై వీడని పీటముడి

ఇస్లామాబాద్/వాషింగ్టన్/దుబాయ్: పశ్చిమాసియాలో హోర్ముజ్ దిగ్బంధం ఏ స్థాయిలో కొనసాగుతోందో పాకిస్తాన్ వేదికగా రెండో దఫా ప్రత్యక్ష చర్చలపై ప్రతిష్టంభన అదే స్థాయిలో కొనసాగుతోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఒకడుగు ముందుకేసి పాకిస్తాన్‌కు స్వయంగా విచ్చేసి ఆ దేశ ప్రధాని, ఆర్మీ చీఫ్‌లతో చర్చిస్తున్న వేళ సంతోషం వ్యక్తంచేసిన





## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం

- రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపామని వెల్లడి
- కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటనకు అంగీకరించినట్లు వెల్లడి
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్న మంత్రి

తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..



# తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు..

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ కుమార్ (1995 బ్యాచ్)ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కార్మిక, ఉపాధి కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎం. దాన కిషోర్ (1996 బ్యాచ్)ను సంజయ్ కుమార్ స్థానంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిశోర్ పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. ఈ బదిలీల్లో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన (2010 బ్యాచ్) బదిలీ ప్రధానంగా నిలిచింది. ఆమెను కార్మిక, ఉపాధి కల్పన శాఖ కార్యదర్శిగా నియమించారు. దీంతో పాటు రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ కార్యదర్శిగా కూడా ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (2018 బ్యాచ్)ని ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీగా బదిలీ చేసి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ డైరెక్టర్‌గా, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (౧+వీణజ) వీసీ & ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రవీణ్య (2016 బ్యాచ్)ను రవాణా, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీగా, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ (2018 బ్యాచ్)ను ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఇంటర్ బోర్డు సెక్రటరీగా నియమించారు. ఇతర ముఖ్యమైన బదిలీలలో, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబ (2016 బ్యాచ్)ను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓగా బదిలీ చేశారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఉన్న కృష్ణ ఆదిత్య (2014 బ్యాచ్)ను పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం. సంతోష్ (2017 బ్యాచ్)ను అదే శాఖ స్పెషల్ సెక్రటరీగా నియమించి, డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగేలా ఆదేశించారు. ఈ మార్పులతో పరిపాలనను మరింత గాడిలో పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన అధికారులకు కూడా వివిధ శాఖల్లో కీలక బాధ్యతలు అప్పగించారు.

# సోమనాథ్ ఛటర్జీలా ఉంటారా? కర్ణుడిలా మిగిలిపోతారా?..

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని, ఆయన వైసీపీ అధినేత చెప్పే 'రూల్స్ బుక్' అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్సీల రాజీనామాలను ఏడాదిగా ఆమోదించకుండా, రాజకీయ దురుద్దేశంతో వాటిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి, దేశ చరిత్రలోనే కోర్టుతో జరిమానా వేయించుకున్న తొలి చైర్మన్‌గా మోషేన్ రాజు అపఖ్యాతి మూటగట్టుకున్నారని ధ్వజమెత్తారు. మోషేన్ రాజు గత రెండు రోజులుగా తీసుకుంటున్న నిర్ణయాలు దారుణంగా ఉన్నాయని అశోక్ బాబు అన్నారు. జయమంగళ వెంకటరమణ వంటి వారు పార్టీ మారే ముందు నైతికంగా తమ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినా, దానిని ఏడాదిగా తొక్కిపెట్టడం కేవలం రాజకీయ కుట్రేనని ఆరోపించారు. ఒక ఎమ్మెల్సీ స్వచ్ఛందంగా పదవి వద్దని రాజీనామా ఇస్తే, దానిని పెండింగ్‌లో ఉంచి వేధించడం ద్వారా చైర్మన్ వ్యవస్థను పార్టీ కార్యాలయంగా మార్చేశారని విచారం వ్యక్తం చేశారు. గతంలో హుందాగా వ్యవహరించిన మోషేన్ రాజు, ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తన మంచి పేరుకు కళంకం తెచ్చుకుంటున్నారని అన్నారు. రాజీనామాను ఆమోదించకపోవడంతో వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించారని, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించినా చైర్మన్ కార్యాలయం స్పందించలేదని అశోక్ బాబు గుర్తుచేశారు. ఈ నిర్లక్ష్యానికి గాను దేశ చరిత్రలో ఏ స్పీకర్‌కు, ఏ చైర్మన్‌కు ఎదురుకాని అవమానం మోషేన్ రాజుకు ఎదురైందని, హైకోర్టు ఆయనకు పెనాల్టీ విధించిందని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం గవర్నర్ తర్వాత అత్యున్నత స్థానంలో ఉండే వ్యక్తి, ఇలా కోర్టుతో జరిమానా వేయించుకోవడం విచారకరమని అన్నారు. కోర్టు 35 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని గడువు విధించాకే, "సహేతుక కారణాలు లేవు" అంటూ రాజీనామాను తిరస్కరించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

### రాజీనామాలపై రాజకీయ కుట్ర

రాజీనామా ఇచ్చే వ్యక్తి కారణాలు చెప్పాల్సిన అవసరం లేదని, నిర్ణీత ఫార్మాట్‌లో లేఖ ఇస్తే చైర్మన్ ఆమోదించాలని రూల్స్ చెబుతున్నాయని అశోక్ బాబు వివరించారు. గతంలో టీడీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా చేసి వైసీపీలో చేరినప్పుడు ఆమోదించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు వైసీపీ నుంచి వెళ్లేవారి రాజీనామాలను అడ్డుకోవడం వెనుక స్పష్టమైన రాజకీయ దురుద్దేశం కనిపిస్తోందన్నారు. రాజీనామాలు ఆమోదించినంత మాత్రాన టీడీపీకి మెజారిటీ వచ్చే అవకాశం లేనప్పటికీ, కేవలం వేధించాలనే ఉద్దేశంతోనే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. స్వయంగా సభలో నిలబడి రాజీనామాను ఆమోదించమని కోరినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

# కేసీఆర్ ఇప్పుడు మనిషి కాదు..

ఈ బహిరంగ సభలో బీఆర్ఎస్ ను కవిత పూర్తిగా టార్గెట్ చేశారు. కేసీఆర్ నేతృత్వంలోని ఉద్యమ రథం దారితప్పిందని, సామాజిక తెలంగాణ రథచక్రం ఎక్కడో విరిగి ముక్కలైందని ఆమె ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చి 12 ఏళ్లయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి కేసీఆర్ ను ఉద్దేశించి కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు.. "కేసీఆర్ గారు ఇప్పుడు మన మనిషి కాదు.. ఆయనో మరమనిషి. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆయన బయటకు రారు. తెలంగాణ ఆత్మను బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయింది" అని కవిత అన్నారు. ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా ఆనాటి కేసీఆర్ బయటకు వచ్చేవారని... ఈనాటి కేసీఆర్ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో చేనేత కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో వారి కోసం కేసీఆర్ జోలె పట్టిన సందర్భాన్ని కవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేసీఆర్ లో మార్పు వస్తుందేమోనని తాను చాలా కాలంగా ఎదురు చూశానని... ఆయనలో మార్పు రాకపోగా, తననే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆత్మను కాపాడేందుకే తాను కొత్త పార్టీ పెట్టానని చెప్పారు.

# మళ్లీ మొదటికి!



(మొదటి పేజీ తరువాయి)

అమెరికా తన బృందాన్ని సైతం పంపేందుకు సంసిద్ధమవుతుండగా అరాఘ్చీ హఠాత్తుగా పాక్‌కు వీడి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కోపం తెప్పించారు. దీంతో ఇరాన్ బృందంలేని పాకిస్తాన్‌లో తాము మాత్రం ఎలా ప్రత్యక్ష చర్చలకు కూర్చోగలమనే అసహనంతో ట్రంప్ వెంటనే తన బృందం ప్రయాణాన్ని రద్దుచేశారు. దీంతో రెండోదఫా ప్రత్యక్ష చర్చలు ఎప్పుడు జరుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఈ అంశంలో ఇరాన్ ఒక స్పష్టతనిచ్చింది. అమెరికాతో మరోమారు ప్రత్యక్షచర్చలకు కూర్చోబోమని తెగేసి చెప్పింది. పరోక్ష చర్చలకే తాము సుముఖంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేల్ శనివారం ప్రకటించారు. ఒమన్‌కు వెళ్లిపోయే ముందు ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చీ ఇస్లామాబాద్‌లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిం మునీర్, పాక్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషక్ దార్‌లతో విస్తృతస్థాయిలో చర్చించారు. శాంతి చర్చలకు సంబంధించిన తమ దేశ డిమాండ్లను అమెరికాకు తెలియజేయాలని సంబంధిత ప్రతిపాదనల చిట్టాను షెహబాజ్‌కు అందజేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ తరఫున ఉప విదేశాంగ మంత్రి కజీమ్ ఘరీబ్‌అబాదీ, విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేల్, పాక్ తరఫున పాక్ అంతర్గత మంత్రి మొహ్‌సిన్ నఖ్వీ సైతం ఈ భేటీలో పాల్గొన్నారు. అయితే చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన అంశాల వివరాలను అటు పాక్‌గానీ ఇటు ఇరాన్‌గానీ అధికారికంగా బహిర్గతంచేయలేదు. ప్రాంతీయ అస్థిరత, శాంతి చర్చల అంశాలపై నేతలు చర్చించారని సామాజిక మాధ్యమంలో ఇరాన్ రాయబార కార్యాలయం ఒక పోస్ట్‌పెట్టింది. ఇరాన్ పెట్టిన షరతులను ఇస్లామాబాద్‌కు విచ్చేసే అమెరికా ప్రతినిధుల ఎదుట పాక్ పెట్టనుందని, వాటికి సమ్మతిస్తేనే ప్రత్యక్ష చర్చలకు ఇరాన్ బృందం పాక్‌కు రానుందని పాక్ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ వివరాలను తుర్కియేతో పాక్ పంచుకుంది. తమ బృందం రాకముందే ఇరాన్ మంత్రి పాక్ నుంచి వెళ్లిపోయారనే వార్త తెల్సి ట్రంప్ వెంటనే కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రతినిధులనూ పాక్‌కు పంపబోమని తెగేసి చెప్పారు. ఈ మేరకు సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్‌పెట్టారు. "18 గంటలు ప్రయాణించి ఇస్లామాబాద్‌కు వెళ్లేందుకు నా బృందం సిద్ధమవుతుంటే వెంటనే ఆగిపొమ్మని చెప్పేశా. పాక్‌కు అన్ని గంటలపాటు ప్రయాణంచేయడం వృథా. అనవసర శ్రమ. పాక్‌లో మనతో మాట్లాడ్డానికి ఎవరూ లేనప్పుడు, ఎలాంటి చర్చల్లేనిదానికి అంతదూరం వెళ్లడం దండగ. అసలే ఇరాన్‌లో ఎవరు తమ నేతనో తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారు. వాళ్లలో ఇన్‌చార్జ్ ఎవరో వాళ్లకే తెలీడంలేదు. ఆట మనచేతుల్లోనే ఉంది. వాళ్లకు అంతగా మాట్లాడాలనుకుంటే ఇరాన్ నాయకులు మనకు ఫోన్‌చేసి మాట్లాడతారు. మేం వినేందుకు సిద్ధంగా ఉన్నాం"అని ట్రంప్ స్పష్టంచేశారు. పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లను పాక్‌కు కొద్దిసేపట్లో పంపబోతున్నామని శ్వేతసౌధంలో ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ అంతకుముందే ప్రకటించగా కొన్ని నిమిషాలకే ట్రంప్ విరుద్ధమైన ప్రకటన చేశారు. దీంతో అమెరికా ప్రతినిధి బృందం పాక్ పర్యటన చివరినిమిషంలో వాయిదాపడింది. ఈ బృందం ఇక ఎప్పుడు పాక్‌కు వస్తుందనేది చెప్పలేని పరిస్థితి నెలకొంది.




# 'హెచ్1బీ' కష్టాలు

మూడేళ్ల పాటు నిషేధం విధించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అమెరికా చట్టసభలో ప్రవేశపెట్టిన 'హెచ్1బీ అబ్యూజ్ యాక్ట్2026'ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు ఎలీ క్రేన్ 'హెచ్1బీ వీసా అబ్యూజ్ యాక్ట్2026'బిల్లును అమెరికా చట్టసభ(కాంగ్రెస్)లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు మరో ఏడుగురు రిపబ్లికన్ చట్టసభ సభ్యులు బ్రియన్ బాబిన్, బ్రాండన్ గిల్, వెస్లీ హంట్, కీత్ సెల్ఫ్, ఆండీ ఓగ్లెస్, పాల్ గోసర్, టామ్ మెక్‌క్లింటాక్ మద్దతుగా నిలిచారు. సహ ప్రాయోజకులుగా(కోస్పాన్సర్లుగా) సంతకాలు చేశారు. హెచ్1బీ వీసా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, స్థానిక అమెరికన్ల ఉద్యోగాలను పరిరక్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని ప్రతిపాదకులు చెబుతున్నారు. అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు పని చేసే విదేశీ ఉద్యోగులను నియమించుకోవడానికి కార్పొరేట్ సంస్థలు హెచ్1బీ వీసా వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. 'అమెరికన్లకు ఉద్యోగం ఇచ్చే అవకాశం ఉంటే, వారినే నియమించుకోవాలి'అని డిమాండ్ చేస్తున్నారు. విదేశీయులకు ఉద్యోగాలు ఇవ్వడాన్ని అరికట్టేందుకు మూడేళ్ల పాటు హెచ్1బీ వీసాల జారీని పూర్తిగా నిలిపివేసి, ఆ తర్వాత కఠిన నిబంధనలు అమలు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. ఈ నిబంధనల ద్వారా అమెరికా పౌరులకు ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత దక్కేలా చేయడమే బిల్లు లక్ష్యమని చట్టసభ సభ్యుడు ఎలీ క్రేన్ స్పష్టం చేశారు.

### హెచ్1బీకి కొత్త నిబంధనలు

- ప్రతిఏటా జారీ చేసే 65,000 హెచ్1బీ వీసాల పరిమితిని ఏకంగా 25 వేలకు తగ్గించడం.
- వీసా దక్కించుకునే విదేశీ నిపుణుల కనీస వార్షిక వేతనం 2 లక్షల డాలర్లుగా ఉండాలి.
- ప్రస్తుతం అమల్లో ఉన్న లాటరీ విధానాన్ని రద్దు చేసి, ఎక్కువ వేతనం ఇచ్చే ఉద్యోగాల ఆధారంగా(వేజ్‌బేస్డ్) ఎంపిక ప్రక్రియ చేపట్టాలి.
- హెచ్1బీ వీసాదారులు తమ కుటుంబ సభ్యులను (డిపెండెంట్లు) అమెరికాకు తీసుకురావడాన్ని నిషేధించాలి.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

# ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్..

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రొఫెసర్ కోదండరాం, టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్‌ల అభ్యర్థిత్వాలను రాష్ట్ర గవర్నర్ ఆమోదించారు. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా మరికొద్ది సేపట్లో విడుదల కానుంది. ఎమ్మెల్సీగా నియామకం ఖరారైన అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవిపై ఎలాంటి ఆశ లేదని, ప్రజా సమస్యలపై గొంతు వినిపించేందుకే ఎమ్మెల్సీ బాధ్యతను స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. వ్యక్తిగత లాభం కంటే ప్రజా ప్రయోజనాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. మరోవైపు, ఇప్పటికే మంత్రిగా కొనసాగుతున్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ సీటు ఖరారు కావడంతో పెద్ద ఊరట లభించింది.

# నాకు మరో అవకాశం దక్కడం నా అదృష్టం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డును ఆయన అందుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమంపై తన దార్శనికతను ఆవిష్కరించారు. "రాష్ట్ర విభజన తర్వాత నాకు అమరావతి రాజధాని నిర్మాణం ద్వారా మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చింది. గతంలో సైబరాబాద్ నిర్మాణంతో దేశానికి ఒక టెక్నాలజీ క్యాపిటల్‌ను ఇవ్వగలిగాం. ఇప్పుడు అమరావతిని అంతకుమించి తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం. ఇది కేవలం ఇటుకలు, కాంక్రీటుతో కట్టే నగరం కాదు. గ్రీన్, బ్లూ సిటీగా, నెట్-జీరో కార్బన్ కాన్సెప్టుతో పర్యావరణ హితంగా నిర్మిస్తున్నాం. హైదరాబాద్ కంటే మెరుగైన, అన్ని హంగులున్న 'హైదరాబాద్ ప్లస్' నగరంగా అమరావతి చరిత్రలో నిలిచిపోతుంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నాలున్నర దశాబ్దాల తన రాజకీయ జీవితంలో సంస్కరణలకు ముందు, తర్వాత భారతదేశాన్ని క్షుణ్ణంగా చూశానని చంద్రబాబు తెలిపారు. "సంపద సృష్టికి సంస్కరణలే పునాది. సంస్కరణలు అమలు చేస్తేనే అభివృద్ధి సాధ్యం, ఆ అభివృద్ధి ఫలాలను సంక్షేమ రూపంలో ప్రజలకు అందించగలం. 1990లలో వచ్చిన ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజన్ 2020 అమలు చేశాం. దాని ఫలాలనే హైదరాబాద్ ఇప్పుడు అనుభవిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు '2047 వికసిత్ భారత్' లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండాలన్నదే నా ఆకాంక్ష. ప్రధాని మోదీ ఒక అత్యుత్తమ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్. ఆయన నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తోంది" అని చంద్రబాబు ప్రశంసించారు. భవిష్యత్తు గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)దేనని చంద్రబాబు అన్నారు. "గతంలో విద్యుత్ సంస్కరణలతో మిగులు విద్యుత్ సాధించాం. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ అమ్మోనియా వంటి రంగాలపై దృష్టి పెట్టాం. ప్రధాని 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యం పెడితే, అందులో ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 90 గిగావాట్ల దిశగా అడుగులు వేశాం. త్వరలోనే విద్యుత్‌ను ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతాం," అని తెలిపారు. ఏఐ టెక్నాలజీని పాలనలో భాగం చేస్తూ ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. విశాఖలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుందని, ఈ నెల 28న దానికి శంకుస్థాపన చేయబోతున్నామని వెల్లడించారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా చేరాలని చంద్రబాబు అన్నారు. "మన సమాజం కేవలం మిలియనీర్లు, బిలియనీర్ల కోసం మాత్రమే కాదు, సామాన్యులది కూడా. అందుకే 'పీ4' (ప్రజలు, పేదలు, భాగస్వామ్యం, ప్రగతి) కార్యక్రమాన్ని రూపొందించాం. సమాజంలో 10 శాతం ఉన్న ధనవంతులు, 20 శాతం ఉన్న పేదలను ఆదుకునేలా 'ఎంబీకే 10-20' ఫార్ములాను తీసుకొచ్చాం. సంపన్నులు మార్గదర్శకులుగా మారి పేదలను చేయూతనివ్వాలి," అని ఆయన పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ, మహిళలు సంకల్పిస్తే ఈ బిల్లు తప్పకుండా అమలవుతుందని, దీనికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# రైతన్నకు అండగా ఉంటాం.. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు
- సర్మన్‌కుంట తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ప్రారంభించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్



**తొలివెలుగు, టేక్మాల్:** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర కల్పించి, వారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ పేర్కొన్నారు. శనివారం టేక్మాల్ మండల పరిధిలోని సర్మన్‌కుంట తండాలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు గోనె సంచులు, కాంటా వేయడంలో, అలాగే తాగునీరు తదితర ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్మన్‌కుంట సర్పంచ్ దేవిక రంగులాల్, మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ కమిటీ చైర్మన్ షేక్ మజహర్, సీఈఓ వెంకటేష్, సంగ్య జీపీ సర్పంచ్ సక్కురు నాయక్, కాంగ్రెస్ నాయకులు తారా సింగ్, శంకర్, ప్రభు, హరి, రమేష్‌తో పాటు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జయంతి ఉత్సవాలకు యాదాద్రి ముస్తాబు

- నేటి నుంచి 30 వరకు నారసింహుడి వేడుకలు
- ప్రతిరోజూ నిత్య గిరిప్రదక్షిణ.. సుదర్శన హోమాలు
- లక్ష కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు రూ. 2016 టిక్కెట్
- గిరిప్రదక్షిణతో పునీతం కానున్న యాదాద్రి
- అనుబంధ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు: ఈవో భవాని శంకర్



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) భవాని శంకర్ తెలిపారు. శనివారం ఆయన ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. ఈ ఐదు రోజుల పాటు యాదాద్రి గిరిపై నిత్య గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. మరోవైపు 26వ తేదీ నుంచి 30 వరకు పాంచాహ్నిక పంచకుండాతీక సుదర్శన హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన, లక్ష పుష్పార్చన సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు రూ. 2016 టిక్కెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందని సూచించారు. భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచేందుకు ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. అనుబంధ ఆలయాలైన పాతగుట్టలో నాలుగు రోజులు, దబగుంటపల్లిలో ఒకరోజు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, డీఈవో నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి మార్గంలో సేవలు అభినందనీయం

- జై శ్రీమన్నారాయణ భక్త బృందానికి ఆర్కే ఫౌండేషన్ సత్కారం
- ఆధ్యాత్మిక ప్రచారమే ధ్యేయంగా కార్యక్రమాలు

**తొలివెలుగు, రాజాపేట:** ఆధ్యాత్మిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న రాజాపేట జై శ్రీమన్నారాయణ భక్త బృందాన్ని ఆర్కే ఫౌండేషన్ శనివారం ఘనంగా సత్కరించింది. స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భక్త బృందం సభ్యులకు అభినందన సత్కారం నిర్వహించారు. లోక కల్యాణం కోసం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, లలిత సహస్రనామ పారాయణం, గోవింద నామ స్మరణ వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న భక్త బృందం సేవలను రాజపేట వాస్తవ్యులైన గుర్రం వంశస్థులు కొనియాడారు. ఈ సందర్భంగా గుర్రం రామచంద్రయ్య కుమారులు ఆర్కే ఫౌండేషన్ ద్వారా భక్త బృందం సభ్యులను శాలువాలు, జ్ఞాపికలతో గౌరవించారు. భక్తిని సామాజిక సేవతో జోడించి ముందుకు సాగడం గొప్ప విషయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్రం రామచంద్రయ్య కుమారుడు గుర్రం లింగం, మనమలు, మనుమరాళ్లు గుర్రం అశోక్, ఇందు, సుష్మ, రాము, వినేష్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. తమ సేవలను గుర్తించి సత్కరించినందుకు శ్రీమన్నారాయణ బృందం సభ్యులు ఆర్కే ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.





# వేద పాఠశాలలకు 'శుభ' ముహూర్తం..

- మే 23న భవన నిర్మాణాలకు శంకుస్థాపన
- కంచి స్వామీజీ మార్గదర్శకత్వంలో ముహూర్తం ఫిక్స్
- 'నారసింహుడి' సన్నిధిలో విద్యా భవనాలపై నీలినీడలు.. అధికారుల తీరుపై విమర్శలు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో వేద పాఠశాల, సంస్కృత పాఠశాల భవనాల నిర్మాణానికి మే 23న శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఈ ముహూర్తాన్ని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఖరారు చేసినట్లు దేవస్థానం వర్గాలు వెల్లడించాయి. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థానం ఈవో భవాని శంకర్, ఆలయ పురోహితులు కలిసి తమిళనాడులోని కాంచీ కామకోటి పీఠానికి వెళ్లి స్వామీజీ ఆశీస్సులతో శుభ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు సమాచారం. త్వరలో స్వామీజీ యాదాద్రి పర్యటనకు రానున్నట్లు కూడా తెలుస్తోంది. యాదాద్రి దేవస్థానం పరిధిలో సంస్కృత, వేద పాఠశాల భవనాల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దశలవారీగా నిర్మాణ పనులు చేపట్టి, అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి చేస్తామని వెల్లడించారు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న సంస్కృత పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరతపై విమర్శలు వినిపిస్తున్నాయి. తరగతి గదులు, విద్యార్థుల వసతి, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు సరిపడా లేవని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థులు తాత్కాలిక ఏర్పాట్లలోనే చదువుకోవాల్సి వస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలో ఒకవైపు శంకుస్థాపన ముహూర్తం ఖరారు కావడం భక్తుల్లో ఆనందాన్ని కలిగిస్తుండగా, మరోవైపు పాఠశాల ప్రస్తుత పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక దేవస్థానం అధికారులు మాత్రం తాత్కాలిక సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని, భవిష్యత్తులో ఈ పాఠశాల యాదాద్రిలో ప్రముఖ విద్యా కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# మీ జనాభా లెక్క.. మీ చేతుల్లోనే!

- 'స్మార్ట్'గా జనగణన-2027 స్వయం నమోదు
- ఇంటికొచ్చే ఎన్యుమరేటర్లకు ఆ 'ఐడీ' చూపిస్తే చాలు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**తొలివెలుగు, టేక్మాల్:** కేంద్ర ప్రభుత్వం ప్రతి పదేళ్లకు ఒకసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే జాతీయ జనగణన (సెన్సస్-2027) కార్యక్రమం త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్రం సరికొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. డిజిటల్ ఇండియాలో భాగంగా తొలిసారిగా పౌరులు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే (డిజిటల్ సెల్ఫ్ ఎన్యుమరేషన్) సదుపాయాన్ని కల్పించింది. ఈ ఆన్‌లైన్ విధానాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**నమోదు విధానం ఇలా..**

ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేకంగా హ్ట్ట్ప్స్://సె.సెన్సుస్.గోవ్.ఇన్/ అనే వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. ప్రజలు తమ స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ఈ పోర్టల్‌లోకి ప్రవేశించి, ముందుగా తమకు వీలైన భాషను ఎంచుకోవాలి. అనంతరం తమ మొబైల్ నంబర్‌ను నమోదు చేస్తే వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలి. ఆ తర్వాత జిల్లా, పిన్ కోడ్, గ్రామం తదితర వివరాలను ఎంపిక చేసి, పోర్టల్‌లోని మ్యాప్ ఆధారంగా తమ నివాసాన్ని కచ్చితంగా గుర్తించాలి.

**ఏమేం వివరాలు అడుగుతారంటే..**

ఇంటి నిర్మాణం తీరు, వసతులు, కుటుంబ సభ్యుల సంఖ్య, కరెంటు, తాగునీటి వనరులు, మరుగుదొడ్డి సదుపాయం ఉందా లేదా?, వంటకు వాడే ఇంధనం, ఇంటర్నెట్ కనెక్షన్, ఇంట్లో ఉన్న వాహనాల వివరాలు తదితర ముఖ్యమైన ప్రశ్నలకు ఆన్‌లైన్‌లోనే సమాధానాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. ప్రక్రియ పూర్తయిన తర్వాత మొబైల్‌కు ఒక 'ఎస్ఈ ఐడీ' (సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడీ) వస్తుంది. ఆ నంబర్‌ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ప్రజలు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసినప్పటికీ, జనగణన కోసం ప్రభుత్వం నియమించిన ఎన్యుమరేటర్లు తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వస్తారు. ఆ సమయంలో ప్రజలు తమ ఫోన్‌కు వచ్చిన ఎస్ఈ ఐడీని వారికి చూపించి, వివరాలను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ జనాభా లెక్కల ఆధారంగానే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, అమలు ఆధారపడి ఉంటాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఎలాంటి తప్పుల్లేకుండా కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని ఆమె కోరారు.



# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

- వాసవి జయంతికి సెలవు ప్రకటించడంపై ఆర్యవైశ్యుల హర్షం
- యాదగిరిగుట్ట ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో కృతజ్ఞతలు

తొలివెలుగు, యాదగిరిగుట్ట: వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించడంపై ఆర్యవైశ్య సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి కృతజ్ఞతగా శనివారం యాదగిరిగుట్టలో ఆర్యవైశ్య సేవా సమితి సభ్యులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి, సెలవు దినంగా ప్రకటించడం చారిత్రాత్మకమని కొనియాడారు. ఈ నిర్ణయం ఆర్యవైశ్యుల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా సమితి సభ్యులు తడక వెంకటేష్, నువ్వుల రమేష్, ఎలకంటి మోహన్, రంగసత్యం, లింగ సత్యం, కోకల రవి, చంద సాయిబాబా, బెలిడే భాస్కర్, అంజయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.




# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వెంకటరాజిరెడ్డి

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: సీఎం రేవంత్ రెడ్డి
- జిల్లా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని పల్లివాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ గంగుల వెంకటరాజిరెడ్డి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై ముఖ్యమంత్రితో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నాయకత్వంలో మండలవ్యాప్తంగా పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు చేరువ చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# కూలీల పొట్ట కొట్టొద్దు..

- ఈ-కేవైసీ నిబంధనను ఎత్తివేయాలి
- పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి: జూకంటి పోలు

**తొలివెలుగు, రాజపేట:** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజువారీ వేతనాన్ని రూ. 800కి పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పోలు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సందర్శించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కూలీలకు అందుతున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని, కనీసం ప్రభుత్వం నిర్ణయించిన రూ. 307 కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రూ. 150 నుంచి రూ. 200 మాత్రమే ఇస్తుండటం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-కేవైసీ విధానం వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తి అనేక మంది పేదలు పనులకు దూరమవుతున్నారని, వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ-కేవైసీ పేరుతో కూలీలను వేధిస్తున్నారని, సామాన్యులకు అర్థంకాని ఈ పద్ధతిని వెంటనే ఎత్తివేయాలన్నారు. కూలీలు గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్తున్నారని, పంచాయతీ ట్రాక్టర్ ద్వారా రవాణా సౌకర్యం కల్పించాలని సర్పంచ్, కార్యదర్శులను కోరారు. అలాగే కూలీలకు వారం వారం సక్రమంగా వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశాల్లో ఎండ తీవ్రత దృష్ట్యా నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, భూమిలేని పేదలకు ఏటా రూ. 12 వేల ఆర్థిక సాయం అందిస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కట్ట రవి, గొల్లూరి ప్రభాకర్, శోభ, సుజాత, కవిత, సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ పులి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యులుగా నర్మెట సుజాత, గోసకొండ ప్రమీల, బోయిన అరుణ, మొక్క లక్ష్మి, వజ్రమ్మ, భీమని సునీత, కట్ట రవి, గోపగాని బాలస్వామి, గోపకాని బాలయ్య, భీమని బాలయ్య పాల్గొన్నారు.

# అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

- సిద్దిరాములు కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్ భరోసా
- రఘునాథపురంలో మృతుడి కుటుంబానికి పరామర్శ
- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శ్రేణులు



**తొలివెలుగు, రాజాపేట:** రఘునాథపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు గుర్రం సిద్దిరాములు కుటుంబాన్ని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ శనివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిద్దిరాములు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సిద్దిరాములు చురుకైన పాత్ర పోషించారని, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఒక నిబద్ధత గల నాయకుడిని కోల్పోవడం పార్టీకి, రఘునాథపురం గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్, సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, సందిల భాస్కర్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, కట్కం పెద్ద వెంకటేష్, కొండం రాజు, రామిండ్ల నరేందర్, గుర్రం నర్సిములు, మర్ల నాగరాజు, నల్ల అశోక్, కటకం నాగభూషణం, బోగ రాజు, డొంకెన మహేందర్ గౌడ్, చింతల రాజు, విష్ణు, తుంగ పృధ్వి, గొర్రెంకల సాయి తదితరులు పాల్గొన్నారు.

# పొట్టిమర్రి వాగు వద్ద 'రహదారి' పాట్లు!

- తెగిపోయిన డైవర్షన్ రోడ్డు.. పట్టించుకోని పాలకులు
- రోడ్డును పరిశీలించిన బీజేపీ మండలాధ్యక్షుడు మేక రమేష్
- పొట్టిమర్రి చౌరస్తాలో నిరసన.. అధికారులకు డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని పొట్టిమర్రి వాగు వద్ద తెగిపోయిన డైవర్షన్ రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు మేక రమేష్ డిమాండ్ చేశారు. శనివారం తెగిపోయిన రహదారిని పరిశీలించిన ఆయన, స్థానిక అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. కాళేశ్వరం వరద తాకిడికి రోడ్డు కొట్టుకుపోయి ఇన్ని రోజులవుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రజాప్రతినిధులకు చీమ కుట్టినట్లైనా లేదని ఎద్దేవా చేశారు. మండలంలో నీటి లభ్యత ఉన్నా చెరువులు నింపడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తక్షణమే డైవర్షన్ రోడ్డును బాగు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాధురి చంద్ర, దాచేపల్లి శ్రీనివాస్, మెందు భగవాన్ రెడ్డి, మార్క శివ, గుజ్జ రాంచెంద్రం, నీల రాజు, బూరెళ్ల శ్రీనివాస్, భీమనపల్లి రమేశ్, పెంట రామకృష్ణ, మెందు మనికుమార్ రెడ్డి, గుల్లపల్లి వెంకటేష్, కాంకోజు భాస్కర్, జంగిటి మహేష్, పిల్లిట్ల సింహాద్రి, మహిళా నేతలు లక్కాకుల మాధవి, భీమనపల్లి రమాదేవి, భూరెలా శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



# జయంతి ఉత్సవాలకు ముస్తాబైన యాదాద్రి



- నేటి నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు
- శోభాయమానంగా విద్యుత్ దీపాలంకరణ.. పుష్పవనంలా గర్భాలయం
- సుదర్శన యాగం కోసం యాగశాల సిద్ధం

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం (26వ తేదీ) నుంచి ప్రారంభం కానున్న జయంతి ఉత్సవాలకు దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 30 వరకు ఐదు రోజుల పాటు వైభవంగా సాగే ఈ వేడుకల కోసం ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధానాలయం సహా గర్భాలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో, సువాసనలు వెదజల్లే వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. చిన్న చిన్న ఉప ఆలయాలకు సైతం పుష్ప తోరణాలను ఏర్పాటు చేసి పండుగ వాతావరణం నెలకొనేలా చేశారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంచకుండాతీక సుదర్శన యాగం కోసం యాగశాలను ప్రత్యేకంగా సిద్ధం చేశారు. ఇందులో ఐదు హోమగుండాలను నిర్మించి, చుట్టూ సంప్రదాయబద్ధంగా తడకల పందిరిని ఏర్పాటు చేశారు. వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ప్రధాన ఆలయం, పాతగుట్ట కోసం కలిపి మొత్తం 21 మంది నిష్ణాతులైన రుత్వికులను ఆహ్వానించారు. ఉత్సవాల్లో స్వామివారు ఊరేగే వాహనాలకు, కవచమూర్తులకు పాలిష్ చేయించి ధగధగలాడేలా మెరుగులు దిద్దారు. కొండపైకి వచ్చే ఘాట్ రోడ్డు పొడవునా భక్తులకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ దీపాల వెలుగులను ఏర్పాటు చేశారు.



# ఆర్టీసీ సమ్మె సఫలం.. స్టీరింగ్ పట్టిన ఎమ్మెల్యే!


- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం
- ఫిట్మెంట్ ఆమోదంపై హర్షం.. కార్మికులకు అండగా ఉంటామని భరోసా
- ప్రయాణికులతో ముచ్చటించి మజ్జిగ పంపిణీ



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** ఆర్టీసీ కార్మికుల సమ్మె విరమణతో రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బస్సులు రోడ్డెక్కడం పట్ల ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో కార్మికులతో కలిసి ఆయన సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ఆర్టీసీ బస్సును నడిపి కార్మికుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో 50 రోజుల పాటు సమ్మె చేసినా పట్టించుకోని పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కేవలం మూడు రోజుల్లోనే చర్చలు జరిపి కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన 11 శాతం ఫిట్‌మెంట్‌ను ఆమోదించిందని కొనియాడారు. సమ్మెలో మరణించిన శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం ప్రకటించడం ముఖ్యమంత్రి మానవత్వానికి నిదర్శనమన్నారు. అనంతరం ప్రయాణికులతో మాట్లాడి, వారికి మజ్జిగ పంపిణీ చేశారు. ప్రభుత్వం కార్మికుల 31 డిమాండ్ల పరిష్కారానికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# మీ వివరాలు మీరే నమోదు చేసుకోండి!

- నేటి నుంచే 'స్వీయ గణన'కు శ్రీకారం
- జనగణన-2027లో ప్రజలే భాగస్వాములు కావాలి
- మే 10 వరకు పోర్టల్ అందుబాటు.. వివరాలు వెల్లడించిన కలెక్టర్ అనురాగ్ జయంతి



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జాతీయ జనగణన - 2027 ప్రక్రియలో భాగంగా ప్రవేశపెట్టిన 'స్వీయ గణన' (సెల్ఫ్ ఎన్యుమరేషన్)ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఈ నెల 26 నుంచి మే 10వ తేదీ వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. డిజిటల్ సాంకేతికతతో పారదర్శకమైన, స్పష్టమైన గణాంకాలను సేకరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జనగణనను రెండు విడతలుగా నిర్వహిస్తామని, మొదటి విడతలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల గణన ఉంటుందని, ఆ తర్వాత రెండో విడతలో జనగణన జరుగుతుందని వివరించారు. ప్రజలు ష్ట్రజూం://ం఻.఻వఅంబం.స్త్రశీఙ.అఅ వెబ్ సైట్ ద్వారా తమ వివరాలను తామే నమోదు చేసుకోవచ్చని, ఆ సమయంలో లభించే ఐడీని తర్వాత ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు అందజేయవచ్చని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు జనాభా ప్రాతిపదికే కీలకమని, కావున ప్రతి ఒక్కరూ వాస్తవ సమాచారాన్ని అందించాలని కలెక్టర్ కోరారు. ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు ఈ అంశంపై విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు.



# నీటిని పొదుపుగా వాడుకోవాలి

- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించిన సర్పంచ్ వెంకటేశం
- ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

తొలివెలుగు, రామన్నపేట: వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామస్థులు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం సూచించారు. శనివారం గ్రామంలోని బోటిమీదగూడెంలో వార్డు సభ్యుడు మేకల జలంధర్‌తో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి ముందు మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు చేరి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే, గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నూతన గృహాల నిర్మాణం చేపట్టవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మేకల జలంధర్, గ్రామపంచాయతీ సిబ్బంది బూడిద మారయ్య, బూడిద ముత్తయ్య, శిరీషాల స్వామి, కొమిరే తిరుమలేష్, శిరీషాల సుధీర్, శిరీషాల గణేష్, జంగం యాదయ్య, శిరీషాల సురేష్, మిర్యాల రాములు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్ట్ యాదిరెడ్డి తండ్రి మృతి బాధాకరం: షానూర్ బాబా

- ఆత్మకూరులో పరామర్శించిన జర్నలిస్ట్ సంఘం నాయకులు
- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ నాగం యాదిరెడ్డి తండ్రి నాగం నర్సిరెడ్డి ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానూర్ బాబా శనివారం యాదిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదిరెడ్డి కుటుంబానికి అసోసియేషన్ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పితృవియోగం ఏ ఒక్కరికైనా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజేఏ జిల్లా కార్యదర్శి గుర్రం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పొన్నగాని సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపట్టాలి

- సామాజిక మార్పులో మహిళల పాత్ర కీలకం
- ఆత్మకూరులో ముగిసిన రెండు రోజుల శిక్షణ తరగతులు




**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మహిళలు కేవలం గృహిణులుగా మాత్రమే కాకుండా, పరిపాలనలోనూ భాగస్వాములై సమాజంలో మార్పు తీసుకురావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నీడ్స్, సరస్వతి ఎడ్యుకేషన్ సొసైటీ (ఎస్ఈఎస్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పరిపాలన అభివృద్ధిలో మహిళల పాత్ర' అనే రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మహిళలకు నాయకత్వ లక్షణాలు, గ్రామ స్థాయిలో నిర్ణయాలు తీసుకోవడం, సమస్యల పరిష్కార మార్గాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా ప్రభుత్వ పథకాల వినియోగం, గ్రామ అభివృద్ధిలో మహిళల ప్రాధాన్యతపై ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగడమే కాకుండా, సామాజిక మార్పుకు వారధిగా నిలవాలని శిక్షణదారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బి. ధనలక్ష్మి, కే. లక్ష్మమ్మ, వార్డు సభ్యులు నోముల రజిత, రంగ సంధ్యారాణి, తవిటి శైలజ, బోస్కో సేవా కేంద్రం వి లీడ్ రీజినల్ కోఆర్డినేటర్ సోడా బత్తిన అంబేద్కర్, తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ ఏ. శిరీష, స్కోప్ మండల కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటేష్, వివిధ గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు, వాలంటీర్లు జ్యోతి, రేణుక, సులోచన, సరిత, మధుసూదన్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు కె. శ్రీశైలం, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి
- లారీల కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశం
- ఆన్‌లైన్ నమోదులో జాప్యం చేయొద్దు
- వలిగొండ మార్కెట్ యార్డులో కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ



**తొలివెలుగు, వలిగొండ:** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యార్డులో ఎన్ని కేంద్రాలు ఉన్నాయి? ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? అన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తేమ శాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని వెనువెంటనే తూకం వేయాలని సూచించారు. ఇందుకోసం అవసరమైతే అదనపు హమాలీలను నియమించుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు రోజువారీగా సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# దేశ ప్రజలను తాకట్టు పెడుతున్న కేంద్రం

- కార్పొరేట్ల కోసమే మోదీ సర్కార్ చట్టాలు
- మహిళా బిల్లు అమలుపై బీజేపీ వెనకడుగు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియతో దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం అమరజీవి కందాల రంగారెడ్డి స్మారక భవనంలో 'మహిళా రిజర్వేషన్ – డీలిమిటేషన్: వంచనలు – వాస్తవాలు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీకి మహిళల పట్ల మొదటి నుంచీ చిత్తశుద్ధి లేదని, అందుకే రిజర్వేషన్ బిల్లు అమలును జాప్యం చేస్తూ వంచనకు పాల్పడుతోందని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పన్నెండేళ్ల కాలంలో రైతు వ్యతిరేక చట్టాలను తీసుకురావడమే కాకుండా, కార్మిక కోడ్‌ల ద్వారా పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచి కార్మికులను




దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రాబోయే మే డే సందర్భంగా కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాదేవి



సైదులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, రాగిరి కిష్టయ్య, నాయకులు ఆదిమూలం నందీశ్వర్, బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాసరెడ్డి, తొర్పునూరు మల్లేశం, బోయ యాదయ్య, నేరడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా రహిత జిల్లాగా మార్చాలి

- పరిసరాల పరిశుభ్రతే మలేరియాకు విరుగుడు
- నిల్వ నీరు లేకుండా జాగ్రత్త పడాలి
- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచన
- ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమల వ్యాప్తిని అరికట్టి, మలేరియా రహిత సమాజాన్ని నిర్మించగలమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భువనగిరి జిజిహెచ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం. మనోహర్ అధ్యక్షతన జరిగిన




ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివాస ప్రాంతాల్లో పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి బోండాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే 'ఫ్రైడే-డ్రై డే' కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ.. దోమ కాటుపై చిన్న నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. విశ్వ విజేత అలెగ్జాండర్ సైతం దోమ కాటుతోనే మరణించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాండు నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ కిరణ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎన్. వంశీకృష్ణ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వీణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ స్వరాజ్య లక్ష్మి, వైద్య అధికారి డాక్టర్ నిరోషా, సబ్ యూనిట్ అధికారులు, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



# శివసత్తుల పూనకాలు.. మహేశ్వరుడికి జలాభిషేకాలు

- కంఠమహేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం
- ఘనంగా గౌడ సంఘం పూజలు
- ఘటాలతో ఊరేగింపుగా వెళ్లిన మహిళలు


**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో కంఠమహేశ్వర స్వామి జలాభిషేక మహోత్సవం శనివారం కనువిందుగా జరిగింది. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు మంగళవాయిద్యాల మధ్య కలశాలతో జలాన్ని నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి పవిత్ర జలంతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు ఎర్ర చిన్న శంకరయ్య గౌడ్, మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్, నాయకులు ఎర్ర వెంకటేష్, గడ్డం శ్రీనివాస్, బందారపు రాములు, భీమగాని రాజారాం, బద్దం నరసింహ, బండి సత్యనారాయణ, గడ్డం శేఖర్, భీమగాని నరసింహ, సురవి బాలరాజు, బండి రవి, పబ్బు యాదయ్య, పానుగంటి రమేష్, బండి గోవర్ధన్, ఎర్ర లక్ష్మణ్, ఎర్ర చందు, గడ్డం రాజు, విక్రం, గణేష్, అర్జున్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న బాధితునికి వాట్సాప్ గ్రూపు సభ్యుల చేయూత

- గుండె శస్త్రచికిత్స కోసం రూ. 38,330 విరాళం
- సమయస్ఫూర్తి చాటుకున్న ఎస్ఎస్ గ్రూప్ సభ్యులు

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** సామాజిక మాధ్యమాలు కేవలం సమాచార మార్పిడికే కాకుండా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడానికి కూడా ఉపయోగపడుతాయని పోచంపల్లికి చెందిన 'ఎస్ఎస్' వాట్సాప్ గ్రూప్ సభ్యులు నిరూపించారు. పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన జినుకల సైదులు కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓజోన్ ఆసుపత్రిలో చేరారు. శస్త్రచికిత్స కోసం భారీగా ఖర్చవుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్పందించారు. సభ్యులందరూ కలిసి చందాలు సేకరించి, రూ.38,330లను శనివారం ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సైదులును పరామర్శించి ఆయన ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ ఎం.ఏ. షరీఫ్, చేరాల లింగస్వామి, వేముల సుమన్ గౌడ్, జినుకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.






# పేదలకు రాజీవ్ ఫౌండేషన్ భరోసా

- నలుగురికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయం
- ట్రస్టు సేవలను అభినందించిన గ్రామస్తులు




**తొలివెలుగు, చౌటుప్పల్:** ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు తన వంతు సహకారాన్ని అందిస్తోంది. ట్రస్టు చైర్మన్ డాక్టర్ మాధవరెడ్డి సౌజన్యంతో మండలంలోని బంగారిగడ్డ, ఆరెగూడెం గ్రామాలకు చెందిన నలుగురు నిరుపేదలకు శనివారం రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బంగారిగడ్డకు చెందిన జహంగీర్ ఖాన్, హసీనా బేగంలతో పాటు ఆరెగూడెంకు చెందిన పెండెం ఉమారాణి, ముద్దం నాగేష్ గౌడ్‌లకు ఈ నగదును పంపిణీ చేశారు. బంగారిగడ్డలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎం.ఏ. ఖయ్యూం, నల్ల నర్సింహా, ఏసుదాస్, షాదీఖానా మాజీ చైర్మన్ హైజిజ్ పాషా, కరీం తదితరులు పాల్గొని నగదును అందజేశారు. ఆరెగూడెంలో జరిగిన కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బొమ్మగాని సాయిరాం గౌడ్, మాజీ సర్పంచ్ ముద్దం సుమిత్ర, సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ట్రస్టు సేవలను ఈ సందర్భంగా స్థానికులు కొనియాడారు.





# చౌటుప్పల్ ధర్మశాల స్థలంలో దుకాణాలు అక్రమమా? సక్రమమా?


నెం. 5/ap/2000/ca తేది: 19/11/2000

ఇందుమూలముగా ధృవపరచునది ఏమనగా! శ్రీ ...
తండ్రి ... గ్రామం చౌటుప్పల, మం. చౌటుప్పల
జిల్లా నల్గొండ గారికి, చౌటుప్పల గ్రామ పంచాయతి పరిధిలో ఇం.నెం. 3-93, 3-94, 3-95, 3-96, 3-97
ఈ కార్యాలయము రికార్డులో వీరి పేరున నమోదు కాబడి ఉన్నది. కావున ధృవీకరణ జారీ చేయనైనది.

పంచాయతీ కార్యదర్శి



- దేవాదాయ శాఖ స్థలంలో యథేచ్ఛగా షాపుల నిర్వహణ!
- అద్దెలు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో తేల్చాలంటున్న స్థానికులు
- గతంలోనే మున్సిపల్ అధికారులకు దేవాదాయ శాఖ ఫిర్యాదు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని దేవాదాయ శాఖకు చెందిన ధర్మశాల స్థలం వివాదంలో చిక్కుకుంది. జాతీయ రహదారి విస్తరణ పోను మిగిలిన ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, యథాతథ స్థితికి విరుద్ధంగా ఇక్కడ షాపుల నిర్వహణ జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### అసలేం జరిగిందంటే..


ప్రాథమిక సమాచారం మేరకు.. దేవాదాయ శాఖ పరిధిలోని ఈ ధర్మశాలకు 1962కి ముందు నుంచే ఐదు షాపులు (నెం. 3-93, 3-94, 3-95, 3-96, 3-97) ఉండేవి. అప్పటి జాతీయ రహదారి నెంబర్ 9 (ప్రస్తుతం 65) విస్తరణలో భాగంగా సుమారు 100 అడుగుల స్థలాన్ని రోడ్డు కోసం సేకరించారు. దీంతో సుమారు 5 అడుగుల పొడవు, 50 అడుగుల వెడల్పు గల భూమి మాత్రమే అక్కడ మిగిలింది. ధర్మశాలను తొలగించినందుకు గాను అప్పట్లో ప్రభుత్వం దేవాదాయ శాఖకు రూ. 3,81,402 పరిహారంగా చెల్లించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే, ఈ పరిహారం సొమ్ముకు సంబంధించి ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తోంది. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున ఇక్కడ 'యథాతథ స్థితి' కొనసాగాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు అంటున్నారు. కానీ, తీర్పు వెలువడక ముందే కొందరు వ్యక్తులు ఆ స్థలంలో దుకాణాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### అద్దెలు ఎవరి ఖాతాలోకి?

కోర్టు తీర్పు వెలువడక ముందే, వివాదాస్పద స్థలంలో కొందరు వ్యక్తులు చొరబడి షాపులు నిర్మించి వ్యాపారాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దేవాదాయ శాఖకు చెందిన ఈ స్థలంలో నడుస్తున్న దుకాణాల నెలవారీ అద్దె ఎవరి జేబుల్లోకి వెళ్తోందనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఆ ఆదాయం దేవాదాయ శాఖకు చేరుతోందా? లేక ప్రైవేటు వ్యక్తులు స్వాహా చేస్తున్నారా? అన్న దానిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### అధికారుల ఉదాసీనత?

ఈ ఖాళీ స్థలంలో వెలిసిన అనధికార దుకాణాలను వెంటనే తొలగించాలని దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి (ఈవో) గతంలోనే చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌కు, చైర్మన్‌కు లేఖ రాసినట్లు సమాచారం. 2010లోనే చౌటుప్పల్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఈ ధర్మశాలకు సంబంధించి యాజమాన్య ధ్రువీకరణ పత్రం దేవాదాయ శాఖకు అందినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఎండోమెంట్ అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మిగిలిన స్థలంలో మెట్లతో సహా 5 షాపులు (7.6 × 3.3 కొలతలతో) వచ్చేలా ప్లానింగ్ సైతం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దేవాదాయ శాఖ అధికారుల ఫిర్యాదులు, ప్లానింగ్‌లు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపుపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కోర్టు పరిధిలో ఉన్న దేవాదాయ శాఖ ధర్మశాల స్థలంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, ఆస్తులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.




## చిరంజీవికి ఎన్టీఆర్ పురస్కారం, కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు

తెలుగు చలనచిత్ర రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'గద్దర్ అవార్డుల' (2025) విజేతల జాబితా శనివారం అధికారికంగా విడుదలైంది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారాల్లో భాగంగా చిత్రసీమకు చెందిన ఇద్దరు దిగ్గజ నటులకు అరుదైన గౌరవం దక్కింది. తెలుగు సినిమాకు మెగాస్టార్ చిరంజీవి అందించిన అసమానమైన సేవలకు గుర్తింపుగా ఆయనను ప్రతిష్టాత్మకమైన 'ఎన్టీఆర్ జాతీయ పురస్కారం'తో ప్రభుత్వం సత్కరించనుంది. అలాగే వెండితెరపై తన విలక్షణ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న లోకనాయకుడు కమల్ హాసన్‌ను 'పైడి జయరాజ్ అవార్డు' వరించింది. ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ స్పెషల్ జ్యూరీ అవార్డుల వివరాలను ప్రకటించారు. 2025 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిల్మ్‌ల నుండి ఈ ఎంపిక జరిగింది. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో నటి జయసుధకు 'ఏఎన్నార్ పురస్కారం', ప్రముఖ నిర్మాత అశ్విని దత్‌కు 'నాగిరెడ్డి చక్రపాణి అవార్డు', గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు 'సినారే అవార్డు' దక్కాయి. ఈ పురస్కారాలను ఈ నెల మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా ప్రదానం చేయనున్నారు.







## తంగడపల్లిలో 'టీబీ ముక్త్ భారత్' వైద్య శిబిరం

- ఉచితంగా ఎక్స్-రే, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు
- ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. "ప్రజా పాలన – ప్రగతి నివేదిక", "టీబీ ముక్త్ భారత్" కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ వెంకటయ్య, కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, కొయ్యడ శేఖర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో మొబైల్ ఎక్స్ -రే యంత్రం ద్వారా టీబీ పరీక్షలు నిర్వహించడంతో పాటు, బీపీ, చక్కెర, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గడ్డం రాజారత్నం, వైద్యులు జయంత్, సౌజన్య, ఆరోగ్య పర్యవేక్షకులు సత్యనారాయణ, ఇస్తారీ, ఝాన్సీ, టీబీ సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## స్పెషల్ ఈవెంట్

'అమిగోస్' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కన్నడ కస్తూరీ ఆషికా రంగనాథ్.. ఫస్ట్‌సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల మనసులను కొల్లగొట్టింది. ఆతర్వాత 'నా సామిరంగా' తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది ఈ అందాల భామ. ఈ సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం 'విశ్వంభర'తోపాటు 'సర్దార్ 2' వంటి భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ఇక సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండే ఈ బ్యూటీ.. తాజాగా 'ఫర్ ఏ వెరీ స్పెషల్ ఈవెంట్' అంటూ కొన్ని ఫొటోలని ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. చేతిలో తెల్లని గులాబీ, ముక్కుకు ముక్కెరతో గుండె గిల్లుతున్న ఈ అందాల భామ లేటెస్ట్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. లెహంగాలో మెరిసిపోతున్న ఆషికా అందానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.'అందమైన గులాబీ సంథింగ్ అమ్మడూ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

